సాక్షి
వికారాబాద్

సోమవారం । 14 । ఆగస్టు । 2023



‘కోటపల్లి’ రూట్ బంద్

వారాంతాల్లో కుటుంబ సమేతంగా ఔటింగ్‌కి వెళ్లి సంతోషంగా గడిపేందుకు పర్యాటకులు కోరుకుంటారు. 8లో▸



ఒకేసారి రైతు రుణమాఫీ

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు టీఆర్ఆర్ అన్నారు. 8లో▸



పేరుకే క్రీడా ప్రాంగణం

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 9లో▸

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీకి అభినందనలు



ఎమ్మెల్సీ దాసోజును సన్మానిస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

తాండూరు టౌన్: బహుజనుల అభ్యున్నతికి కృషి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రావణ్ కుమార్‌ను బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ కోరారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో ఎమ్మెల్సీని కలిసి శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్‌కుమార్ వెంట హరిగౌడ్, శ్రీశైలం తదితరులున్నారు.

జిల్లా వ్యాప్తంగా నాకాబందిి

20 వాహనాలు సీజ్



ఎన్నెపల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ నర్సింహులు

అనంతగిరి: జిల్లావ్యాప్తంగా నిర్వహించిన నాకాబందిలో 20 వాహనాలు సీజ్ చేశామని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయా స్టేషన్ల పరిధిలో పోలీసులు చేపట్టిన నాకాబందిలో పలు వాహనాలను తనిఖీ చేశారు. 1,486 వాహనాలు తనిఖీ చేయగా సరైన ధ్రువపత్రాలు లేని 20 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

దిగొస్తున్న టమాటా రేటు



వికారాబాద్ అర్బన్: అధిక వర్షాల కారణంగా ఆకాశాన్నంటిన టమాట ధరలు.. రెండు రోజులుగా దిగొస్తున్నాయి. ఆదివారం వికారాబాద్ వ్యవసాయ మార్కెట్లో కిలో టమాట రేటు రూ.50 పలికింది. మరో వారం పది రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. రూ.200 ధర పలికిన టమాట రేటు తగ్గడంతో వినియోగదారులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

తీగలతో మంత్రి సబితారెడ్డి భేటీ

- వేదికైన తీజ్ వేడుక

మహేశ్వరం: కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి ఆదివారం సాయంత్రం భేటీ అయ్యారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ మల్లాపూర్‌లో జరిగిన తీజ్ వేడుకకు ఇది వేదికైంది. ఈ వేడుకలకు మంత్రి సహా మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. కొద్ది కాలంగా అంటీముట్టనట్లుగా ఉంటున్న ఆయన వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి తాను కూడా పోటీ చేస్తానని బహిరంగంగా ప్రకటించారు. తాజాగా ఇద్దరూ ఒకే వేదికపై కలుసుకొని రహస్య చర్చలు జరపడం రాజకీయంగా రచ్చనీయాంశమైంది. అలక పాన్పు ఎక్కిన తీగలను మంత్రి బుజ్జగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వచ్చే ఎన్నికల్లో ఇద్దరం కలిసి పని చేద్దామని అరగంటపాటు చర్చించుకున్నట్లు సమాచారం. మంత్రి మెట్టు దిగి మాట్లాడడంతో ఆయన కొంత శాంతించినట్లు వినికిడి. కొంత కాలంగా తీగల పార్టీని వీడుతున్నారని పుకార్లు చెలరేగాయి. ఇద్దరు నేతల మధ్య రాజీ కుదరడంతో నియోజకవర్గంలో ఇప్పటివరకు నెలకొన్న అంతర్గత విభేదాలు తొలగిపోయినట్టేనని బీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు నేతలు కలిస్తే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తిరుగుండదని భావిస్తున్నారు.

సహనాన్ని పరీక్షించొద్దు

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: అధికార పార్టీ నేతలు తమ సహనాన్ని పరీక్షించొద్దని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాఖీ పండుగ విశిష్టతను తెలియజెప్పేందుకు ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటిస్తూ మహిళలకు పసుపు, కుంకుమ, చీర అందజేస్తున్నామని తెలిపారు. ఇది జీర్ణించుకోలేని అధికార పార్టీ నేతలు కొందరు తమ పై దాడులకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లేడు, గాలిగూడెం గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు తమపై దాడికి ప్రయత్నించారని పేర్కొన్నారు.

‘పట్నం’ శిబిరంలో అలజడి

తాండూరులో టికెట్ పంచాయితీ మరోమారు తెరపైకి వచ్చింది. ఈ అసెంబ్లీ స్థానం నుంచి టికెట్ కోసం ఇద్దరు నేతలు పోటీ పడుతుండడంతో మళ్లీ రచ్చమొదలైంది. ఇప్పటికే ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గ్రూపుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఎన్నికల సమరం సమీపిస్తుండడంతో పార్టీ అధిష్టానం సైతం బుజ్జగింపుల పర్వం మొదలుపెట్టింది.

- తాండూరు నుంచి రోహిత్‌రెడ్డికి టికెట్.?
- మంత్రి పదవి, రాజ్యసభ స్థానం కేటాయిస్తామంటూ మాజీ మంత్రి మహేందర్‌రెడ్డికి ఆఫర్



తాండూరు: తాండూరు నియోజకవర్గ టికెట్ కేటాయింపు విషయమై పట్నం మహేందర్‌రెడ్డి శిబిరంలో అలజడి మొదలయింది. నిన్నటి వరకు బీఆర్ఎస్ టికెట్ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికే వస్తుందంటూ ధీమాతో ఉన్న ఆయన అనుచరుల్లో ఒక్కసారిగా నైరాశ్యం నెలకొంది. శనివారం మంత్రి హరీశ్ రావు, ఎంపీ రంజిత్‌రెడ్డి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో చర్చలు జరిపినట్లు సమాచారం. తాండూరు అసెంబ్లీ స్థానంలో పోటీ విరమించుకుంటే మంత్రి పదవితోపాటుగా రాజ్యసభకు పంపించేందుకు సీఎం కేసీఆర్ అనుకూలంగా ఉన్నారని నచ్చజెప్పారంటూ వార్తలు చక్కర్లు కొట్టాయి. ఆదివారం విషయం తెలుసుకున్న పట్నం వర్గీయులు మండల స్థాయి నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేస్తూ ఆందోళన చెందుతున్నారు. అయితే పట్నం ఈ విషయమై ఎలాంటి నిర్ణయానికి రాలేదు.

జంబో జాబితా తర్వాతే నిర్ణయం

బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జంబో జాబితా బయటకు వచ్చాకే పట్నం మహేందర్‌రెడ్డి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారని ఆయన అనుచరగణం అంటున్నారు. కాగా తాండూరు నుంచి టికెట్ రాకపోతే తన వెంట నడిచేవారెందరున్నారని ఆయన లెక్కలేసుకుంటున్నారు. ఇప్పటికే కొంత మంది నాయకులు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి అనుకూలంగా ఉంటూ డబుల్ గేమ్ ఆడుతున్నారంటూ ఆయన సన్నిహిత వర్గాలతో అన్నట్లు తెలిసింది. నియోజకవర్గ స్థాయిలో మహేందర్‌రెడ్డికి బలమైన కేడర్ ఉన్నప్పటికీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి టికెట్ ఇస్తామని హామీ ఇవ్వడంతో పైలట్ పేరు తొలి జాబితాలోనే వస్తుందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

పదవుల కోసం టికెట్ త్యాగం చేస్తారా..?

తాండూరు నియోజకవర్గం నుంచి 1994 నుంచి 2018 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం మహేందర్‌రెడ్డి ఆరు సార్లు పోటీ చేయగా .. నాలుగు సార్లు విజయం సాధించారు. వచ్చే ఎన్నికల్లోనూ తాండూరు నుంచే పోటీ చేస్తానంటూ ఆయన పలుమార్లు ప్రకటించారు. అయితే శనివారం బీఆర్ఎస్ పెద్దలతో జరిగిన చర్చల్లో పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవితో పాటు సతీమణి జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిని రాజ్యసభకు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయమై ఆయన నియోకవర్గ ముఖ్య నాయకుల అభిప్రాయం తీసుకుంటున్నారు. మరో రెండు మూడు రోజుల్లో తాండూరు అసెంబ్లీకి పోటీ చేస్తారా.. లేక పదవులతో సైలెంట్ అయిపోతారా అనేది స్పష్టత రానుంది. ఈ విషయమై పట్నం మహేందర్‌రెడ్డిని వివరణ కోరగా తాను తాండూరు అసెంబ్లీని వదులుకొనే ప్రసక్తే లేదన్నారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా పోటీ చేయడం ఖాయమన్నారు.



చంద్రశేఖర్ నివాసంలో విలేకరులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

కమలం వీడి.. కాంగ్రెస్ గూటికి

వికారాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ బీజేపీకి రాజీనామా చేశారు. ఈ నెల 18న జహీరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇదే విషయమై ఆయన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో జిల్లా నాయకులతో తన నివాసంలో చర్చలు జరిపారు.

- టికెట్ హామీతో బీజేపీకి గుడ్‌బై చెప్పిన ఎ.చంద్రశేఖర్
- ప్రధాన పార్టీలన్నింటిలో చేరి తిరిగి హస్తం చెంతకు
- అయోమయంలో ఏసీఆర్ అనుచరగణం

వికారాబాద్: మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ కమలంను వీడి కాంగ్రెస్ గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ మేరకు ఆయన శనివారం తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించారు. కాంగ్రెస్ పెద్దల నుంచి సీటు కేటాయింపుపై స్పష్టమైన హామీ లభించిన తర్వాతే ఆయన బీజేపీకి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో చురుగ్గా పని చేసిన ఆయన కొంతకాలంగా స్తబ్దుగా ఉంటున్నారు. పార్టీ కార్యకలాపాల్లోగానీ.. కేడర్ బలోపేతం చేయడంగానీ కనిపించలేదు. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన ప్రధాని మోదీ సభకు సైతం ఆయన గైర్హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మార్పు, బీఆర్ఎస్ అవినీతిపై కేంద్రం చర్యలు తీసుకోకపోవడం, ఎస్సీ వర్గీకరణ విషయంలోనూ ఆయన సొంతపార్టీపైనే విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతూ వచ్చారు. పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఆయన్ను బుజ్జగించేందుకు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు.

ఐదు పార్టీలు.. ఐదుసార్లు విజయం

ఇప్పటి వరకు ఐదు పార్టీలు మారిన మాజీ మంత్రి ఏసీఆర్ టీడీపీ, బీఆర్ఎస్ మినహాయిస్తే ఏ పార్టీలోనూ ఎక్కువ కాలం ఇమడలేకపోయారు. ఐదు సార్లు శాసనసభ్యుడిగా ఎన్నికైన ఆయన్ను మూడు సార్లు మంత్రి పదవి వరించింది. 2009 ఉప ఎన్నికల్లో గడ్డం ప్రసాద్ చేతిలో ఓటమి పాలైన ఆయన అనంతరం ఏ ఎన్నికల్లోనూ గెలువలేకపోయారు.

18న కాంగ్రెస్ తీర్థం

మాజీ అమాత్యుడు ఎ.చంద్రశేఖర్ ఈ నెల 18న జహీరాబాద్‌లో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో పార్టీ కుండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. తన తండ్రి స్వగ్రామం జహీరాబాద్ నియోజకవర్గంలో ఉన్న నేపథ్యంలో అక్కడ నుంచి పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అధిష్టానం సైతం స్పష్టమైన హామీ ఇచ్చినందునే ఆయన పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు చర్చించుకుంటున్నారు. ఇటీవల కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం.. రాష్ట్రంలో బీజేపీ ఒడిదొడుకులు.. కాంగ్రెస్‌తో ఆయనకున్న సత్సంబంధాల నేపథ్యంలో మళ్లీ కాంగ్రెస్‌లో చేరేందుకు ఆయన రంగం సిద్ధం చేసుకుంటున్నారని తెలుస్తోంది.

అయోమయంలో కేడర్

ఏసీఆర్ బీజేపీకి రాజీనామా చేయడంతో పాటు కాంగ్రెస్‌లో చేరడం ఖరారు కావడంతో ఆయన అనుచరులు అయోమయానికి గురవుతున్నారు. తరచూ పార్టీలు మారుతుండటం.. ఏ పార్టీలోనూ ఎక్కువ రోజులు నిలకడగా ఉండకపోవటంతో ఆయన వెంట వెళ్లాలా వద్దా..? అనే ఆలోచనకు వచ్చినట్లు తెలుస్తోంది. వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా బలమైన నాయకుడు మరో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ఉండటంతో ఏసీఆర్ కాంగ్రెస్‌లో చేరినా మరో నియోజకవర్గానికి వెళ్లాల్సిందే. జహీరాబాద్ లేదా చేవెళ్ల రెండింటిలో ఏదో స్థానం నుంచి టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆయన వికారాబాద్ నుంచి పోటీ చేసే అవకాశం లేనందున మరో పార్టీ చూసుకుందామనే ఆలోచనలో అనుచరులున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఆయన పార్టీ మారిన ప్రతీసారి ఆయనతో వెళ్లడం.. అక్కడ ఆయన నిలదొక్కుకోకపోవడం.. నియోజకవర్గంలో సమయం ఇవ్వకపోవడంతో కేడర్ అసంతృప్తికి గురవుతున్నారు.

పీసీసీ చీఫ్‌తో ఏసీఆర్ భేటీ

ఇప్పటికే బీజేపీకి రాజీనామా చేసిన ఎ.చంద్రశేఖర్ ఆదివారం నగరంలోని తన నివాసంలో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డితో కలిసి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లో చేరే విషయంపై చర్చించినట్లు ఆయన మీడియాకు వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికే ‘బస్తీబాట’



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే బస్తీబాట కార్యక్రమాన్ని చేపట్టామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 5, 10వ వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పట్టణ సుందరీకరణకు చర్యలు

పట్టణంలో అవసరమైన ప్రతీ చోట సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి చర్యలు చేపట్టి నెల రోజుల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చెత్త సేకరణ వాహనాలు రావడం లేదని.. కాలనీల్లో మురుగు నిల్వ ఉంటోందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆ సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ సుందరీకరణకు ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, కౌన్సిలర్లు నాగేశ్వర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీత్లా పండుగలో ఉద్రిక్తత

- ఇరువర్గాల మధ్య ఘర్షణ

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లిలో ఆదివారం సీత్లా పండుగ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలోని గిరిజన కుటుంబాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ర్యాలీగా గ్రామ పొలిమేరలో ఉన్న దేవతామూర్తుల విగ్రహాల వద్దకు బయలుదేరారు. ఓ వర్గం వారు మైకులు పెట్టి ఉత్సాహంగా బయలుదేరగా మరో వర్గం వారు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఘర్షణ ప్రారంభమైంది. ర్యాలీ మధ్యలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసినా ఫలితం లేకుండాపోయింది. ఒకరినొకరు దూషించుకుంటూ బాహాబాహీకి దిగారు. ఓ వర్గం నుంచి ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతి, మరో వర్గం నుంచి సర్పంచ్ విజయలక్ష్మి వర్గం వారు ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. ఎస్ఐ వెంకటనారాయణ తన సిబ్బందితో ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరికి గ్రామ పెద్దల జోక్యంతో ఇరువర్గాల వారు దేవతామూర్తులను దర్శించుకుని ఎవరికి వారు ఇళ్లకు చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ర్యాలీలో ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

వెంటాడుతున్న బీపీ, తీపి

- చిన్న వయసులో చుట్టుముడుతున్న రుగ్మతలు
- పెరుగుతున్న రక్తపోటు, మధుమేహం బాధితులు
- జీవనశైలి, ఆహారపు అలవాట్లే కారణం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



షాబాద్: గతంలో వృద్ధాప్యం వచ్చాక రుగ్మతలు చుట్టుముట్టేవి. ప్రస్తుతం ఆధునిక జీవనశైలితో 30 ఏళ్ల వయసులోనే ముప్పేట దాడి చేస్తున్నాయి. వాతావరణం, ఆహారం, నీరు, ధ్వని, వాయు కాలుష్యం కారణంగా జనం బత్తిడితో కూడిన జీవితాన్ని గడుపుతున్నారు. వెరసి యుక్త వయస్సు వచ్చీరాగానే మధుమేహం (షుగర్), అధిక రక్తపోటు (బీపీ) బారిన పడుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో రెట్టింపు..

చిన్న వయసులోనే బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడటంపై వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవగాహనతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 30 ఏళ్ల వయసు దాటిన షుగర్ వ్యాధి గ్రస్తులు 84,564 మంది, అధిక రక్తపోటు వ్యాధిగ్రస్తులు, 58,398 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. వీరే కాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో రెట్టింపు సంఖ్యలో బాధితులు వైద్యం పొందుతున్నట్లు తెలిసింది.

సర్వేలో తేటతెల్లం..

జిల్లాలో మెట్రో సిటీ కల్చర్ వచ్చేసింది. ఫాస్ట్‌పుడ్, జంక్‌ఫుడ్‌తో అందుబాటులోకి వచ్చాయి. ఇంట్లో వంటలు పక్కనబెట్టి రెడీమేడ్ ఫుడ్ వైపు పరుగులు తీస్తున్నారు. అంతే వేగంగా వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వెంటాడుతున్నాయి. వైద్యారోగ్యశాఖ ఇటీవల ఇంటింటి సర్వే చేపట్టగా షుగర్, బీపీ బాధితులు ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు.

వ్యాయామంతో షుగర్ కంట్రోల్..

హెచ్‌బీఏ1సీ పరీక్ష చేయించుకుంటే షుగర్ ఉందో లేదో తెలుస్తుంది. ఉదయాన్నే పరిగడుపున ఏమీ తినకుండా, తాగకుండా తీసిన రక్తంలో షుగర్ 100 లోపు ఉంటే వ్యాధి లేనట్లే. 100 నుంచి 126లోపు ఉంటే ప్రీడయాబెటిక్ దశలో ఉన్నట్లు లెక్క. ఈ దశలో జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి రాదు. 140 నుంచి 200 వరకు ఉంటే డయాబెటిక్ దశలో ఉన్నట్లు లెక్క. షుగర్ 200 దాటితే వ్యాధి ఉన్నట్లు అర్థం. వ్యాయామం చేస్తే షుగర్‌ను కంట్రోల్‌లో ఉంచొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

హైబీపీకి చెక్ పెట్టొచ్చు..

ఉరుకుల, పరుగుల జీవితంలో కలిగే మానసిక ఒత్తిడితో కొన్నిసార్లు వంశపారంపర్యంగా బీపీ వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆహారంలో ఉప్పు, కారం, మసాలాలు తగ్గించాలి. బీపీ 120 బై 80కి మించకుండా చూసుకోవాలి. 60 ఏళ్లు దాటిన వారికైతే 130బై90 ఉన్నా పరవాలేదు. అంతకు మించి ఉంటే హైపర్ టెన్షన్ ఉన్నట్లే. బీపీని నిర్లక్ష్యం చేస్తే బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంటుంది. మందులతో పాటు మెడిటేషన్ చేస్తే దీనికి చెక్ పెట్టొచ్చని వైద్యులు చెబుతున్నారు.

కిడ్నీలకు ఎఫెక్ట్..



దీర్ఘకాలికంగా మధుమేహం ఉన్నవారు కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వ్యాధి వచ్చిన ఏడు నుంచి పదేళ్లలో కిడ్నీలు దెబ్బతింటాయి. ఊబకాయులకు సైతం ఈ ప్రమాదం ఉంటుంది. మధుమేహం రోగులు కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ శ్రీనివాస్ వడ్డే, జనరల్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్

‘ఆరోగ్య రథం’తో పేదలకు మెరుగైన వైద్యం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: ఆరోగ్య రథం సేవలతో పేదలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని ఎమ్మెల్యే స్వగ్రామం చించేల్‌పేట్‌లో ఆదివారం ఆయన అభివృద్ధి పనుల శంకుస్థాపనతో పాటుగా ఆరోగ్యరథం వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంపీ రంజిత్‌రెడ్డి సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన ఆరోగ్య రథం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. పేదలకు ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడం హర్షనీయమన్నారు. రైతుబంధు, రైతుబీమా తదితర సంక్షేమ పథకా లతో పేదలకు పెద్దన్నలా మారారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యురాలు జయమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్, కృష్ణారెడ్డి, దయాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు ‘రెట్టింపు’ సంతోషం

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో రేషన్ డీలర్లు సంబురాల్లో మునిగిపోయారు. కమీషన్ పెంపు, హెల్త్‌కార్డు, బీమా సౌకర్యాల కల్పనతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఎట్టకేలకు నెరవేరిన డిమాండ్లు
- క్వింటాల్‌కు కమీషన్ రూ.70 నుంచి రూ.140కి పెంపు
- హెల్త్‌కార్డు, బీమా సౌకర్యం కల్పించిన సర్కార్



వికారాబాద్ అర్బన్: రేషన్ డీలర్లను ఆదుకోవాలంటూ ఏళ్ల నుంచి ఆసంఘం చేస్తున్న పోరాటానికి ఎట్టకేలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కమీషన్‌ను రెట్టింపు చేయడంతోపాటుగా వారి కుటుంబానికి హెల్త్‌కార్డులు, కోవిడ్‌తో చనిపోయిన డీలర్ల కుటుంబ సభ్యులకే దుకాణాలు కేటాయిస్తామమంది. ఈ నిర్ణయంతో జిల్లా వ్యాప్తంగా 588 మంది డీలర్లకు మేలు చేకూరనుంది.

రూ.140కి పెంచిన కమీషన్

ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ డీలర్ల కమీషన్ తక్కువగా ఉండేది. 2014 వరకు క్వింటాలుకు రూ.20 వరకు ఉన్న కమీషన్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక డీలర్లు ఆందోళనలు, నిరసనలతో ప్రభుత్వం మరో రూ.40 అదనంగా పెంచడంతో క్వింటాలుకు రూ. 60కి చేరింది. 2015లో ఆహార భద్రత చట్టం అమల్లోకి రావడంతో కేంద్రం వాటా కింద మరో రూ.10 కేటాయించడంతో కమీషన్ రూ.70కి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.10 పెంచాల్సి ఉండగా చాలా కాలంగా తాత్సారం చేసింది. రేషన్ సరఫరా దుకాణాల అద్దెలు విపరీతంగా పెరిగాయని.. ప్రభుత్వం ఇస్తున్న కమీషన్ సరిపోవడం లేదని కొంత కాలంగా డీలర్లు ఉద్యమాలు చేపడుతున్నారు. వీరి డిమాండ్ల పరిష్కారానికి కసరత్తు చేపట్టిన ప్రభుత్వం కమీషన్‌ను రూ.140కి పెంచడంతో పాటుగా రూ.5లక్షల వరకు హెల్త్‌కార్డు, రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.

తప్పుడు తూకానికి చెక్

స్టాక్ పాయింట్ల వద్దే వే బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గోదాంల వద్ద తప్పుడు తూకంతో డీలర్లకు ఇబ్బందిగా మారింది. వారికి పంపిణీ చేసే బియ్యానికి సంబంధించి ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద గోదాం ఇన్‌చార్జిలు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. 50 కిలోల బ్యాగు డీలర్ల వద్దకు వచ్చే వరకు రెండు నుంచి ఐదు కిలోల వరకు తక్కువ తూకం వస్తోందనే విమర్శలున్నాయి. దీనిపై డీలర్లు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టినా సమస్య పరిష్కారమవ్వలేదు. ఈ తప్పుడు తూకంలో స్టాక్ పాయింట్లోని హమాలి నుంచి ఉన్నతాధికారుల వరకు సహకారం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా పరిశీలించిన ప్రభుత్వం స్టాక్ పాయింట్ల వద్దనే వేబ్రిడ్జి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు నిధులను సైతం విడుదల చేసింది.

గౌరవ వేతనం అడిగాం



రేషన్ డీలర్ల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఇందుకు తమ సంఘం నుంచి ధన్యవాదాలు. గౌరవేతనం ఇవ్వాలని కోరగా దేశంలో ఎక్కడా లేదని ప్రభుత్వం వివరించింది. కమీషన్‌తో పాటుగా హెల్త్‌కార్డులు, బీమా సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉంది. స్టాక్ పాయింట్ల వద్దే ఏర్పాటు చేయనున్న వే బ్రిడ్జిలతో నష్టం తగ్గుతుంది.

– జూకా రెడ్డి, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

పూడూరు: మండల పరిధిలోని అంగడి చిట్టంపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం టాటాఏస్‌లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని చన్గోముల్ పీఎస్ పోలీసులు పట్టుకున్నారు. పది క్వింటాళ్ల రేషన్‌బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం బెబ్యానాయక్ తండాకు చెందిన సురేష్, శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రధాని ఫొటోతో అసభ్యకర పోస్టు

పీఎస్‌లో బీజేపీ నేతల ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాండూరు బీజేపీ నాయకులు పట్టణ సీఐ రాజేందర్ రెడ్డికి ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. చేతిలో ఫోన్ పట్టుకుని అశ్లీల చిత్రాలు చూస్తున్నట్లు ఉన్న వ్యక్తి ముఖాన్ని మార్ఫింగ్ చేసి మోదీ ఫొటోతో 'ఐఎన్‌సీ, బీఎస్పీ, బీజేపీ, బీఆర్‌ఎస్ తాండూరు నియోజకవర్గం' అనే గ్రూప్‌లో ఒక మెంబర్ పోస్టు చేశాడన్నారు. దేశ ప్రధానిపై అసభ్యకరంగా పోస్టు చేసిన సదరు వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షులు సతీష్ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

షటర్ తాళాలు పగులగొట్టి..

- వైన్స్‌లో చోరీ. రూ.20వేల నగదు అపహరణ
- కుల్కచర్ల పీఎస్ పరిధిలో ఘటన



సీసీ ఫుటేజీలో నమోదైన దృశ్యాలు

కుల్కచర్ల: గుర్తుతెలియని వ్యక్తులు వైన్స్ దుకాణంలో చోరీకి పాల్పడి కౌంటర్‌లోని నగదును తస్కరించిన ఘటన కుల్కచర్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర వైన్స్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి షెటర్‌కు ఉండే తాళాలను పగులగొట్టి అందులో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. గమనించిన పక్క దుకాణదారులు వెంటనే అందులో క్యాషియర్‌గా పని చేసే శంకరయ్యకు సమాచారం ఇచ్చారు. శంకరయ్య వైన్స్ వద్దకు చేరుకుని పరిశీలించగా కౌంటర్‌లోని రూ.20వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైన్స్‌లో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా కౌంటర్‌లో ఉన్న డబ్బును గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్తున్నట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగిరాలేదని..

మనస్తాపంతో భర్త ఆత్మహత్య



నారాయణ మృతదేహం

బషీరాబాద్: ఇంట్లో గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్తాపంతో భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్వత్‌పల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నారాయణ(45) తాగుడుకు బానిసయ్యాడు. దీంతో తరుచూ భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో వారం రోజుల కిందట భార్య భాగ్యలక్ష్మీతో గొడవపడ్డాడు. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. వారం గడిచినా తిరిగి ఇంటికి రాకపోవడంతో మనస్థాపానికి గురైన నారాయణ శనివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలోనూ నారాయణ ఆత్మహత్యాయత్నం చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతిడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'కోట్‌పల్లి' రూట్ బంద్



ప్రాజెక్టుకు వెళ్లేదారిలో ఫారెస్టు అధికారులు వేసిన కంచె



నిరుత్సాహంతో వెనుదిరుగుతున్న పర్యాటకులు

- ప్రాజెక్టుకు వెళ్లే దారులన్నీ మూసివేసిన అధికారులు
- కారణం చెప్పకుండానే పర్యాటకులను వెనక్కి పంపిస్తున్న వైనం
- నిరుత్సాహంతో వెనుదిరిగిన పర్యాటకులు

ధారూరు: వీకెండ్‌లో ఔటింగ్‌కి వెళ్లి ఎంజాయ్ చేయాలని ప్రతి పర్యాటక ప్రేమికుడికి ఉంటుంది. అందులోనూ మెజార్టీ ఉద్యోగులు, పనిచేసేవారు, విద్యార్థులకు సెలవు రోజైన ఆదివారం బయటికి వెళ్లాలని ఉంటుంది. హైదరాబాద్ శివార్లలో పర్యాటక ప్రాంతాలు చాలానే ఉన్నప్పటికీ వికారాబాద్ జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్టు, అనంతగిరి హిల్స్‌కి ప్రత్యేక స్థానం ఉంది. నగరానికి కూతవేటు దూరంలో ఉండటంతో వీకెండ్స్‌లో కోట్‌పల్లికి పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. ఓవైపు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం అంటున్నప్పటికీ అవేవీ కోట్‌పల్లి దగ్గర కనిపించడంలేదు. కోట్‌పల్లి ప్రాజెక్టు వద్దకు పర్యాటకుల రాకను జనవరి నెల నుంచి రెవెన్యూ, పోలీసు, ఫారెస్టు అధికారులు నిషేధించారు.

దారులన్నీ మూసివేత..

జనవరి నెలలో పూడూర్ మండలం మన్నెగూడ గ్రామానికి చెందిన నలుగురు యువకులు ప్రాజెక్టు నీటిలో మునిగి చనిపోయారు. దీనిని కారణంగా చూపి ప్రాజెక్టు వద్దకు పర్యాటకులను రాకుండా అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ విమర్శలు ఉన్నాయి. ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు ఉన్న దారులన్నీ జేసీబీలతో తవ్వేసి పోలీసుల పహారా పెట్టారు. అయినప్పటికీ పర్యాటకులు అడవిలోని వేరే దారుల ద్వారా ప్రాజెక్టు వద్దకు చేరుకుంటున్నారు. ఆదివారం సైతం ఇలాగే పర్యాటకులు ప్రాజెక్టు వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు. ప్రాజెక్టుకు రాకుండా అధికారులు నిషేధించడంపై పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ చర్యలు పట్టవా..

అనంతగిరి గుట్టలోని అనంతపద్మనాభస్వామిని నిత్యం వేల సంఖ్యలో పర్యాటకులు దర్శించుకుంటుంటారు. వారిలోని మెజార్టీ పర్యాటకులు అక్కడినుంచి నేరుగా కోట్‌పల్లి ప్రాజెక్టుకు వచ్చి అలుగు పారే సుందర దృశ్యాలను తిలకించి వనభోజనాలు చేసి వెళ్లడం అలవాటుగా మార్చుకున్నారు. అయతే గత జనవరిలో జరిగిన ఘటనతో పర్యాటకుల రాకను అడ్డుకోవం ఏంటని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు వద్ద రక్షణ చర్యలు చేపట్టకుండా పర్యాటకుల రాకను నిషేధించడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అఫీషియల్ బ్యానర్, ప్రకటన లేకుండా పర్యాటకులను ప్రాజెక్టు వద్దకు వెళ్లనీయకపోడం ఎంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటినుంచైనా అధికారులు పునరాలోచించి ప్రాజెక్టు వద్ద రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు పర్యాటకులను అనుమతించాలని కోరుతున్నారు.

పర్యాటకులను అనుమతించాలి

పూడూర్ మండలం మన్నెగూడకు చెందిన నలుగురు యువకులు జనవరిలో ప్రాజెక్టు నీటిలో మునిగి చనిపోయారు. ప్రాజెక్టు వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడమే ప్రమాదానికి కారణమని అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి నుంచి ప్రాజెక్టు వద్ద పర్యాటకుల రాకను అడ్డుకుంటున్నారు. పర్యాటకులను అడ్డుకోవడం మానుకుని ప్రాజెక్టు వద్ద ప్రమాదలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. పోలీసుల పహారా ఏర్పాటు చేయాలి. ఉన్నదాధికారులు స్పందించి కోట్‌పల్లి ప్రాజెక్టు వద్దకు పర్యాటకులను అనుమంతించాలి.

– సతీష్, హైదరాబాద్

ఒకేసారి రైతు రుణమాఫీ

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కోట్‌మర్పల్లి గ్రామంలో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం హాత్‌సే హాత్ జోడో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా హామీలను విస్మరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తామన్నారు. అన్నివర్గాలకు న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్, బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిఖీల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేష్, జిల్లా నాయకులు శంకరయ్యగౌడ్, సంజీవరెడ్డి, రాములు, ఎల్‌డీఎం వికారాబాద్ ఇన్‌చార్జి శ్యామల రఘుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు సురేష్, మర్రి లక్ష్మారెడ్డి, మధుకర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు.. రాచన్న, సురేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం..

పూడూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వరంగల్ డిక్లరేషన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మన్నేగుడ జేకే ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీఆర్ఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో నిరేపేదలకు పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామన్నారు. ప్రస్తుత బీఆర్‌ఎస్ సర్కార్ గత ఏడేళ్లనుంచి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామంటూ ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుపేదలకు పక్కా ఇళ్లు, నిరుద్యోగ యువతకు 2లక్షల ఉద్యోగాలు, 2లక్షల రైతు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర, అసైన్డ్ భూములు అమ్ముకునేలా చట్టం తెస్తామని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల సతీష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అజీంపటేల్, జిల్లా కార్యదర్శులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్, పెంటయ్య, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్, అశోక్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు పాల్గొన్నారు.



ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కాంగ్రెస్ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



నియామకపత్రం అందుకుంటున్న అశోక్‌రెడ్డి

పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ కార్యదర్శి కిరణ్ ముగబసవ్

దోమ: జిల్లా రాజీవ్ పంచాయతీ రాజ్ సంఘటన్ కోఆర్డినేటర్‌గా దొంగ ఎన్కేపల్లి గ్రామ సర్పంచ్ అశోక్‌రెడ్డిని నియమించినట్లు పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ కార్యదర్శి కిరణ్ ముగబసవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పూడూర్ మండలంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో అశోక్‌రెడ్డికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విధి విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధాలను ప్రజలకు వివరించాలన్నారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన కిరణ్ ముగబసవ్‌తో పాటు డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో స్వచ్ఛందగా చేరుతున్నారని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అమీర్‌పేట్, సిరిగిరిపురం గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మహేశ్వరం గడ్డపైన ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. తాను చేసిన అభివృద్ధి, సంక్షేమమే భారీ మెజార్టీతో గెలిపిస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ వంటి కార్యక్రమాలే బీఆర్‌ఎస్ పార్టీని మూడోసారి గెలిపిస్తాయని ఆమె పేర్కొన్నారు. త్వరలో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి భారీ ఎత్తున బీఆర్‌ఎస్‌లోకి చేరికలు ఉంటాయన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎండీ.సమీర్, చాకలి ప్రవీణ్, విజయ్, ప్రవీణ్, ఈదయ్య, నర్సింహ, డీవీఎస్‌రెడ్డి, పాండుచారి, సత్యనారాయణ చారి, రమేష్, లింగం పలువురు చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాయప్ప, అమీర్‌పేట్ ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవరం గౌడ్, మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, వార్డు సభ్యులు రాజు, గ్రామశాఖ అధ్యక్షుడు వెంకటేష్, కోఆప్షన్ సభ్యుడుఅశోక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

నిలిచిఉన్న ఆటోను ఢీకొట్టిన కారు



చెట్లపొదల్లోకి దూసుకెళ్లిన ఆటో

- నలుగురికి గాయాలు
- గట్టెపల్లి గేట్ సమీపంలో ప్రమాదం

ధారూరు: రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోను వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టిన సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లగొండ జిల్లా డిండి మండలం దేవరి నెమిలిపూర్‌తండాకు చెందిన ముడావత్ నరేందర్ ఈనెల 12న కుటుంబ సభ్యులతో కలిసి యాలాల మండలంలోని సోమనాథ్ ఆలయానికి వెళ్లారు. ఆదివారం దైవ దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తాండూర్–ధారూరు రోడ్డులో మూత్ర విసర్జన కోసం గట్టెపల్లి గేట్ పక్కనే ఆటోను నిలిపారు. ఇదే సమయంలో తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు మితిమీరిన వేగంతో నిలిపి ఉన్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఆటోలో కూర్చుని ఉన్న నరేందర్ కుటుంబ సభ్యులైన బుజ్జి, లిత, సూర్యతో పాటు ఓ పసిపాపకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని పోలీసులు 108లో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

లారీ బోల్తా.. బాలుడికి గాయాలు



నీటిలో బోల్తాపడిన లారీ

ఇబ్రహీంపట్నం: కృష్ణ వాటర్ పైపులైన్ బైపాస్ రోడ్డు సమీపంలో కుంట వద్ద లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం చాంద్‌ఖాన్‌గూడకు చెందిన యాదగిరి(40), మణి(12)తండ్రీ, కొడుకులు లారీలో వస్తున్నారు. నాగన్‌పల్లి వెళ్లేదారిలో మొగుళ్లవంపు కుంట నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి కుంటలో పడింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నీటిలో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. ఆ బాలుడి చేతికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ యాదగిరికి ఎలాంటి గాయాలు కాలేదు.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మితిమీరిన వేగంతో..

- డివైడర్‌ను ఢీకొట్టిన డీసీఎం
- తప్పిన ప్రమాదం

తుర్కయంజాల్: మితిమీరిన వేగంతో డీసీఎం నడపడంతో అదుపు తప్పి డివైడర్ ఎక్కిన సంఘటన ఆదివారం సాగర్ రహదారిపై మన్నెగూడ వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బొంగ్లూర్ నుంచి తుర్కయంజాల్ వైపునకు వెళ్తుండగా మన్నెగూడ చౌరస్తాకు చేరుకోగానే డీసీఎం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. డివైడర్‌పై ఉన్న చెట్లనుంచి వెళ్లడంతో వాహనం ఆగిపోయిందని స్థానికులు పేర్కొన్నారు.



డివైడర్ ఎక్కిన డీసీఎం

కనులపండువగా స్వామివారి కల్యాణం



కల్యాణోత్సవంలోని ఓ ఘట్టం

తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్‌లోని వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగుల పూలు, విద్యుదీపాలతో చక్కగా అలంకరించారు. బాజా భజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలును శావ తీశారు. లోక కళ్యాణార్థం వేద పండితులు శ్రీనివాసామూర్తి, మురళీకృష్ణల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు సమకూర్చిన పట్టు పీతాంబు వస్త్రాలను ఉత్సవ విగ్రహాలకు ధరింపజేశారు. విగ్రహాలను ఆలయ మండపానికి తీసుకొచ్చి కల్యాణానికి ముస్తాబు చేశారు. అర్చక, పూజారులు వేద మంత్రాలు చదువుతుండగా ముత్యాల తలంబ్రాలతో మంగళసూత్రధారణ గావించారు. భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గోవిందనామస్మరణతో వేదాద్రి మార్మోగిపోయింది. కన్నుల పండువగా జరిగిన ఈ కార్యక్రమానికి హైదరాబాద్, షాద్‌నగర్, శంషాబాద్, తదితర పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగీత, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవికుమార్, ఎంపీటీసీ అంబాజీ, ఉప సర్పంచ్ అజీజ్, నాయకులు విష్ణువర్ధన్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, అశోక్ గుప్తా, కృష్ణ, నరేందర్‌గౌడ్, అర్చక వేద, పూజారులు నరసింహ్మాశర్మ, భరద్వాజశర్మ, ప్రవీణ్‌శర్మ, కేదార్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

మా భూములు మాకిప్పించండి



జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న దళిత కుటుంబాలు

బడంగ్‌పేట్: కబ్జాలో ఉన్న తమ భూములు దక్కేలా చూడాలని బడంగ్‌పేటకు చెందిన దళిత కుటుంబాలు ఆదివారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులకు మొరపెట్టుకున్నారు. బడంగ్‌పేటలోని దావుత్ ఖాన్‌గూడలో సర్వేనె నంబర్–2లో ఉన్న భూమిని నమ్ముకుని తాతలు, తండ్రులు ఇప్పటి తరం వారు జీవిస్తున్నామన్నారు. సాగు భూమిలో ప్రభుత్వ భవనాలు నిర్మించారని మిగిలిన భూమినైనా నాడు సాగులో ఉన్న కుటుంబాలకు చెందేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులు సైతం మిగిలిన భూమిని దళిత కుటుంబాలకు కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీమోర్చా తెలంగాణ అధ్యక్షుడు కొప్పు బాషా, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్‌రెడ్డి, బీఎంసీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సైనిక కుటుంబాలకు అండగా ఉంటాం



మాజీ సైనికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

బడంగ్‌పేట్: రాజకీయ నేతలను ఏడాది పాటు బర్డర్‌లో ఉంచితే సైనికుల క్రమశిక్షణ, దేశభక్తి, భారత రాజ్యాంగం, చట్టం విలువలు తెలుస్తాయని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బడంగ్‌పేట కార్పొరేషన్‌లో నివాసం ఉంటున్న మాజీ సైనికులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న పార్లమెంట్ సభ్యులను బఫున్లు అన్న సినిమా కమెడియన్‌పై (ప్రకాష్‌రాజ్) ఈసీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. దళిత, సైనికుల భూములను తెలంగాణ సర్కార్ లాగేసుకుంటుందని ఆరోపించారు. దేశం కోసం త్యాగాలు చేసిన సైనికుల కుటుంబాలకు చెందాల్సిన భూములు, స్థలాలు ఇచ్చేలా అసెంబ్లీలో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఆంధ్రాలో మాజీ సైనికుల భూములకు ఎన్‌ఓసీ ఇస్తుంటే ఇక్కడ కబ్జాలు చేస్తున్నారని కేసీఆర్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. నేటి నుంచి మూడు రోజుల పాటు హర్ ఘర్ తిరంగా ప్యార్ పేరుతో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని మోదీ పిలుపు నిచ్చాడని అన్నారు. అనంతరం విశ్రాంత త్రివిధ దళాల సైనికులను సన్మానించి మెమొంటోలను బహూకరించారు. పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలాన్ శంకర్‌రెడ్డి, జంగయ్య, సుదర్శన్‌రెడ్డి, సుధాకరశర్మ, దేవేందర్‌రెడ్డి, మధన్‌మోహన్‌గుప్తా, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగుల గోస పట్టని సర్కార్

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి

మొయినాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వానివి హామీలే తప్పా అమలు చేసిందిలేదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శన్ అన్నారు. మండలంలోని మేడిపల్లిలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యువకులు, మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు సబ్సిడీలు ఎత్తేసి, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేస్తుందని విమర్శించారు. ప్రజలంతా నిరాశతో ఉన్నారని.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి సతీష్, నియోజకవర్గం నాయకుడు వసంతం, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, యువజన కాంగ్రెస్ నియోజవకర్గం అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్‌లు చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఏబ్లాక్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, వాసుదేవ్, నాయకులుపాల్గొన్నారు.